నమస్తే తెలంగాణ
# హనుమకొండ
3 | వరంగల్, గురువారం 3 అక్టోబర్ 2024 | HANUMAKONDA



వేయిస్తంభాల దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కాశీబుగ్గలో..


వేయిస్తంభాల గుడిలో వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు


పరకాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నర్మెట : వెల్దండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



# బతుకమ్మ వైభవం
# ఆడబిడ్డల సంబురం..


ములుగులో బతుకమ్మతో చిన్నారి


వేయిస్తంభాల దేవాలయంలో వర్షంలోనే బతుకమ్మ ఆడుతున్న మహిళలు


భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



**ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ**
- ఆటాపాటలతో ఆడబిడ్డల సంబురం
- ఉమ్మడి జిల్లా అంతటా అట్టహాసంగా వేడుక
- ఉయ్యాల పాటలతో మార్మోగిన ప్రధాన కూడళ్లు, ఆలయాలు


మహబూబాబాద్‌లో..

తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో వాకిళ్లన్నీ పూదోటలయ్యాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడబిడ్డలు ఆడిపాడగా ఊరూవాడన సంబురం అంబరాన్నంటింది. తొలిరోజు బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ పండుగ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైభవంగా జరుగగా చిన్న, పెద్దా, అంతా కలిసి ఉయ్యాల పాటలతో హోరెత్తించారు. పట్టణాలు, జిల్లాకేంద్రాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడంతో ప్రధాన కూడళ్లు, ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఎప్పటిలాగే హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం ఆడబిడ్డలతో కోలాహలంగా మారింది. చాలా చోట్ల వర్షం కురిసినా వానలోనూ సంతోషంగా ఆడిపాడారు. అలాగే యువతులు, చిన్నారులు తాము అలంకరించిన బతుకమ్మలతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఆ తర్వాత వాయినం ఇచ్చి పుచ్చుకున్నారు.

*- నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 2*








బతుకమ్మలతో వేయిస్తంభాల ఆలయానికి వస్తున్న యువతులు


నర్సంపేటలో..


ములుగులోని శివాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# గాలివాన బీభత్సం

- ఉమ్మడి వరంగల్‌లోని పలు మండలాల్లో వర్షం
- విరిగి పడిన విద్యుత్ స్తంభాలు, కూలిన చెట్లు
- ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులు.. నేలవాలిన వరిపంట

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో పాటు వేగంగా వీచిన గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడగా, పలుచోట్ల వరి తదితర పంటలు నేలవాలాయి. పలు గ్రామాలు విద్యుత్ లేక అంధకారంలో ఉన్నాయి. వరంగల్ నగరంలోని పలు ప్రాంతంలో వర్షం దంచికొట్టింది. భారీగా వీచిన గాలులకు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని బొల్లోనిపల్లె నుంచి రంగాపురం వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు కూలింది. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి గ్రామాల్లో స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరి, పత్తి, కురగాయల పంటలు దెబ్బతిన్నాయి. మండంలోని చిన్న పెండ్యాల, నష్కల్, రాజవరం, పల్లగుట్టతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురవడంతో పత్తి, మక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే ములుగు జిల్లా కేంద్రంతో పాటు ములుగు మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. మల్లంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలోని చెట్టుపై పిడుగుపడి చెట్టు చీలిపోయింది. పాఠశాలకు దసరా సెలవులు కావడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, పలువురి ఇండ్లపై రేకులు ఎగిరిపోయాయి. మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఉన్న సుమారు 100 ఏళ్ల నాటి భారీ చింత చెట్టు నేలకూలింది. బోరునర్సాపురం–చెరుపల్లి రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వెంకటాపూర్ మండలంలోని పాలంపేట–వెంకటాపూర్ రహదారిలో చెట్లు కూలడంతో గంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హనుమకొండ జిల్లా శాయంపేట, ఆత్మకూరు మండలాలతో పాటు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలకొట్టు వద్ద చెట్టు విరిగి 11 కేవీ విద్యుత్ లైన్‌పై పడడంతో విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే ముల్కలపల్లి వద్ద విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అలాగే నర్సింహులపేట, నెల్లికుదురు, దంతాలపల్లి, చిన్నగూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో సైతం భారీ వర్షం కురిసింది.


మంగపేటలోనిశివాలయం సమీపంలో నేలకూలిన వందేళ్ల చింత చెట్టు


ములుగు రూరల్ : మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలోని చెట్టుపై పిడుగు పడటంతో చీలికలు ఏర్పడిన దృశ్యం


చిల్పూరు : చిన్నపెండ్యాలలో కురుస్తున్న వర్షం

# కూలీలపై పిడుగు..

- పత్తి చేనులో పనులు చేస్తూ ముగ్గురు మహిళా రైతుల మృత్యువాత
- హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లో ఘటన


కారట్లపెల్లి లక్ష్మి, ఇటుకల నిర్మల, సోలెంక రమ (ఫైల్)

ఆత్మకూరు/రేగొండ, అక్టోబర్ 2 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధవారం రెండు చోట్ల పిడుగులు పడి ముగ్గురు మహిళలు మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపల్లి గ్రామానికి చెందిన ఇటుకల నిర్మల (51), సొలెంక రమ (45)తో పాటు మరో ఎనిమిది మంది పత్తి ఏరేందుకు కూలీ పనికి వెళ్లారు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో వాన మొదలవ్వడంతో పక్కనే ఉన్న చెట్టు కింద నిర్మల, రమ నిల్చున్నారు. మిగతా వారు వేరే చోట ఉన్నారు. ఇదే సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. నిర్మలకు ముగ్గురు కుమార్తెలు, భర్త రాజేందర్ ఉన్నారు. రమకు ఇద్దరు కుమారులు, భర్త మహేందర్ ఉన్నారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లెకు కారట్లపెల్లి లక్ష్మి (49)భర్త నగేశ్‌తో కలిసి వ్యవసా య పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లింది. పత్తి మొక్కలకు ఎరువులు వేస్తున్న క్రమంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడుతుండడంతో ఇంటికి వచ్చేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. కాగా, విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# సినీఫక్కీలో చోరీ.. సీసీ ఫుటేజీతో చిక్కి

- ఎట్టకేలకు పోలీసులకు దొరికిన అంతర్రాష్ట్ర దొంగ
- ఫిబ్రవరిలో బయ్యారంలో ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.28లక్షలు లూటీ
- ఏటీఎం వద్ద సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించి నిందితుడి రిమాండ్

బయ్యారం అక్టోబర్ 2 : ఏటీఎంలే లక్ష్యంగా దొంగతనాలకు తెగబడుతూ సినీఫక్కీలో రూ.28లక్షలు ఎత్తుకెళ్లిన అంతర్రాష్ట్ర ముఠా ఎట్టకేలకు చిక్కింది. సీసీపుటేజీలు, వేలిముద్రల సాయంతో రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడిని పట్టుకోవడమే గాక అతడితోనే సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించి రిమాండ్‌కు పంపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 17న అర్ధరాత్రి మహబూబాబాద్ జిల్లా బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఏస్‌బీఐ ఏటీఎంను దొంగలు పగుల గొట్టి రూ. 28.70 లక్షలు చోరీ చేశారు. మరుసటి రోజు ఉదయం ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చిన వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు వేలిముద్రలు, సీసీ ఫుటేజీలు, ఇతర ఆనవాళ్ల ఆధారంగా రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగలపనేనని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అప్పటినుంచి వారిని పట్టుకునేందుకు తీవ్రంగా గాలిస్తున్న పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని పట్టుకున్నారు. బుధవారం మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో నిందితుడిని ఏటీఎం వద్దకు తీసుకొచ్చి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించి చోరీ చేసిన తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ జిల్లా పలోడి ప్రాంతానికి చెందిన అబ్దుల్ గని మరికొందరితో కలిసి ఫిబ్రవరిలో బయ్యారంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. కారులో వచ్చిన నిందితులు గ్యాస్ కట్టర్ సాయంతో ఏటీఎంను బద్దలు కొట్టి కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే చోరీ పూర్తి చేశారన్నారు. ప్రధాన సూత్రధారి అబ్దుల్ గనిపై పలు రాష్ట్రాల్లో ఏటీఎంలలో చోరీ చేసిన కేసులతో పాటు రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఛీటింగ్ కేసులున్నట్లు తెలిపారు. ఏటీఎంలను టార్గెట్ చేసి చాకచక్యంగా చోరీకి పాల్పడుతున్న అబ్దుల్ గనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. అంతర్రాష్ట్ర ఏటీఎం దొంగను పట్టుకున్న ఎస్సై తిరుపతి, సీఐ రవికుమార్, డీఎస్పీ తిరుపతిరావును మానుకోట ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.


ఏటీఎం వద్ద సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు, సీఐ రవికుమార్

# మాజీ రౌడీషీటర్‌కు గన్‌మెన్ల తొలగింపు!

- మంత్రి అనుచరుడు నవీన్‌రాజ్ ఆగడాలను వెలుగులోకి తెచ్చిన 'నమస్తే తెలంగాణ'
- తాజాగా సీఐతో వాగ్వాదం, 'తూర్పు'లో వివాదాల ఫలితం

నమస్తే ఎఫెక్ట్

సుబేదారి, అక్టోబర్ 2 : మంత్రి కొండా సురేఖ అనుచరుడు, మాజీ రౌడీ షీటర్ నవీన్‌రాజ్‌కు గన్‌మెన్లను తొలగిస్తూ పోలీసు ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మంత్రికి ప్రధాన అనుచరుడిగా వ్యవహరిస్తున్న ఆయన వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొంతకాలంగా ఓ ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల సహకారంతో సెటిల్‌మెంట్లు, సామాన్యులపై జులుం ప్రదర్శించడం, వినని వారిపై కేసులు పెట్టించి ప్రతాపం చూపడం, అధికార పార్టీ నాయకులను సైతం పోలీసులతో కొట్టించిన సంఘటనలను ఇటీవల 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. 'రౌడీకి పోలీస్ సలాం, 'తూర్పులో రౌడీరాజ్యం', 'రౌడీలు రెచ్చిపోతున్నా నోయాక్షన్' శీర్షికలతో అతడి ఆగడాలను ప్రచురించడంతో స్పందించిన పోలీసు శాఖ నిఘావర్గాలతో ఆరా తీసి విచారణ చేపట్టింది. అంతేగాక వరంగల్ నగరంలో ఎప్పుడూ లేని విధంగా వివాదాలకు తెరతీసి, దందాల పాల్పడుతున్న విషయమై కొందరు అధికార పార్టీ నేతలు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో రాష్ట్ర ఇంటలిజెన్స్ పోలీసు అధికారులు తీవ్రంగా పరిగణించి నిఘావర్గాల నుంచి అందిన విచారణ నివేదిక ఆధారంగా బుధవారం నవీన్‌రాజ్ గన్‌మెన్లను తొలగిస్తూ ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.

# కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి
- క్రమశిక్షణ నిబంధనలు ఉల్లంఘించారని చర్యలు
- మరో ముగ్గురు వర్సిటీ ఉద్యోగులపైనా వేటు


రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్( ఆర్ట్స్ కాలేజీ) పెండ్లి అశోక్‌బాబును సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జి వీసీ ఆమోదంతో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ విచారణ, రెవెన్యూ శాఖ సర్వే పూర్తయిన నేపథ్యంలో తహసీల్దార్ రిజిస్ట్రార్‌కు రిపోర్ట్ పంపించారు. దీని ఆధారంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు రిజిస్ట్రార్ మెమోలు జారీ చేశారు. పెండ్లి అశోక్‌బాబు సహా మిగిలిన ముగ్గురు మెమోకు ప్రత్యుత్తరాలను సమర్పించారు. ఇటీవలే రిజిస్ట్రార్ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దగ్గరకు వెళ్లగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ సహా మిగిలిన ముగ్గురిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

**గాంధీ జయంతి వేడుకల్లో అశోక్‌బాబు వీరంగం..**

కేయూ పరిపాలనా భవనంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తుండగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు అక్కడికి చేరుకుని రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగి వీరంగం సృష్టించాడు. కార్యక్రమంలో అశోక్‌బాబు గందరగోళాన్ని సృష్టించారని, ఆయన ప్రవర్తన యూనివర్శిటీ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని, వర్శిటీ గౌరవం, ప్రతిష్టకు భంగం కలిగించొద్దని సస్పెన్షన్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. సస్పెన్షన్ వెంటనే అమల్లోకి వస్తుందన్నారు.

**అశోక్‌బాబుతో పాటు మరో ముగ్గురిపై వేటు**

వర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగ ల్యాబ్ అటెండెంట్ బుచ్చయ్య, పబ్లికేషన్ సెల్ విభాగ వెయిటర్ ఎల్లస్వామిని సస్పెండ్ చేశారు. అలాగే ఎన్ఎస్ఎస్ ఆఫీస్‌లో ఒప్పంద డ్రైవర్‌గా పనిచేస్తున్న యాదగిరికి టర్మినేషన్ ఉత్తర్వులు జారీ చేశారు.